క్లుప్తంగా

ఇంజినీరింగ్ విద్యపై అవగాహన సదస్సు


మాట్లాడుతున్న విజయకుమార్‌రెడ్డి

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో ఆదివారం ఇంజినీరింగ్ విద్య ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసుకుని ఎంసెట్‌లో ఉత్తీర్ణులై ఇంజినీరింగ్‌లో చేరేందుకు ఆసక్తి చూపుతున్న విద్యార్థులకు ఒకరోజు శిక్షణ ఇచ్చారు. కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఇంజినీరింగ్ కోర్సులు, కళాశాలల ఎంపిక, కౌన్సెలింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. భవిష్యత్తులో ఇంజినీరింగ్ పూర్తి చేసిన వారికి ఉన్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలను తెలిపారు. ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరే విద్యార్థులు పరిశోధనలపై ఆసక్తి చూపాలని సూచించారు. ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో ఉన్న మౌలిక సదుపాయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఓడీలు చింతా రవీంద్రరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, హరనాథ్‌రెడ్డి, కిషంధర్ పాల్గొన్నారు.

నాయుడుపేటకు చినజీయర్ స్వామిజీ రాక

నాయుడుపేట టౌన్ : పద్మభూషణ్ త్రిదండి చినజీయర్ స్వామిజీ ఆదివారం రాత్రి నాయుడుపేటకు రానున్నట్టు ఆయన భక్తులు తెలిపారు. ఆయన చెన్నై నుంచి సోమశిలకు వెళుతూ నాయుడుపేటలోని అగ్రహారపేటలో ఉన్న మారంరెడ్డి అమర్‌నాథ్‌రెడ్డి నివాసానికి ఆదివారం రాత్రి చేరుకుని బస చేస్తారని పేర్కొన్నారు. సోమవారం ఉదయం అమర్‌నాథ్‌రెడ్డి నివాసం వద్దనే స్వామిజీ పూజ, తీర్థగోష్టి ఉంటుందని వెల్లడించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీని సత్కరిస్తున్న అధికారులు, నాయకులు

నాయుడుపేట టౌన్ : నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. ఆమెను ఆదివారం నాయుడుపేటలోని మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం నివాసం వద్ద వివిధ శాఖల అధికారులు, పలు మండలాలకు చెందిన నాయకులు కలిసి సత్కరించారు. అలాగే పట్టణంలోని చిన్న దర్గా కమిటీ సభ్యులు కలిశారు. ఈ నెల 27 తేదీన పట్టణంలో జరిగే గంధోత్సవానికి రావాలని ఆహ్వానించారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన


కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని రాజగోపాలపురం ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం పెళ్లకూరు చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తిరుపతి శ్రీవెంకటేశ్వర అరవింద్ నేత్రాలయ వైద్య సిబ్బంది 140 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 30 మందికి కంటి అద్దాలు అందజేసినట్టు ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ చాగణం గౌరీశంకర్, సీఈవో సీతారామనాయుడు తెలిపారు. అదే విధంగా 40 మందికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయించనున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏవో గల్లా కృష్ణ, అరవింద్ నేత్రాలయ సిబ్బంది శంకర్, తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 6.438 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 6.438 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 20, లోలెవల్ కాలువకు 40 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సుబ్రమణ్య స్వామి ఆలయంలో కుజదోష నివారణ పూజలు


అలంకరణలో సుబ్రమణ్యస్వామి

చిట్టమూరు(చిల్లకూరు) : చిట్టమూరు మండలం మల్లాంలో వెలసిన వళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి ఆలయంలో ఆదివారం కుజదోష నివారణ పూజలు చేశారు. స్వామి వారికి ఉదయం పలు రకాల అభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. పలువురు భక్తులు తమ పిల్లలకు కుజ దోష నివారణకు ప్రత్యేక పూజలు చేయించారు.

తగ్గిన వేరుశనగ దిగుబడి

- గిట్టుబాటు ధర లభించక తీవ్ర నష్టాలు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు


వ్యవసాయ పొలంలోని వేరుశనగ ఓదెలు

పెళ్లకూరు : ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేసే రైతులకు దిగుబడులు తగ్గిపోవడం, చేతికొచ్చిన అరకొర పంటకు ధరలు లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. మండలంలోని చావలి, చెంబడిపాళెం, ఆర్లపాడు, అర్ధమాల, జీలపాటూరు, చెన్నప్పనాయుడుపేట తదితర గ్రామాల్లో సుమారు 430 హెక్టార్లలో ట్యాగ్24, కే6 రకాల విత్తనాలను సాగు చేశారు. ఎడగారు సమయంలో విపరీతమైన ఎండలతో వాతావరణం అనుకూలంగా లేకపోవడం వల్ల మొక్కలు ఎదుగుదల ఊహించని విధంగా తగ్గిపోయింది. దాంతో రైతులు ఎక్కువగా రసాయన ఎరువులు విరివిగా వినియోగించారు. అయినప్పటికీ మొక్కల్లో ఎదుగుదల లేదు. ఒక్కో మొక్కకు కేవలం 8 నుంచి 15లోపు చిట్టిచిట్టి వేరుశనగ కాయలు కాశాయి. దీనికితోడు దిగుబడి పూర్తిగా తగ్గింది. ఆర్లపాడు, నందిమాల, యడపూడి గ్రామాల్లో వర్షాభావం వల్ల భూగర్భ జలాలు అడుగంటడంతో సాగునీరు అందక చాలాచోట్ల పంటలు ఎండిపోయాయి.

పెట్టుబడులు అధికం

ఒక ఎకరా వేరుశనగ పంటపై సాధారణంగా రూ.30 వేల వరకు పెట్టుబడికి ఖర్చు అవుతుంది. ఈ ఏడాది రూ.35 వేల నుంచి రూ.40 వేలకు పైగా ఖర్చు అయింది. విత్తనాల ఎంపికలో సరైన అవగాహన లేక రైతులు వేరుశనగ సాగులో తీవ్ర నష్టాలు చవి చూస్తున్నారు. మొక్కలు కూడా నేలను తాకుతున్నట్లుగా పెరుగుదల లోపంతో పూత బాగా తగ్గిపోయింది. గతంలో ఒక ఎకరాకు 35 నుంచి 42 బస్తాల వరకు దిగుబడి వచ్చేది. ఈ ఏడాది 18 నుంచి 20 బస్తాలు మాత్రమే దిగుబడి వస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనికితోడు దళారులు రైతులను మభ్యపెట్టి వేరుశనగకు ధరలు లేవంటూ అతి తక్కువకు కొనుగోలు చేస్తున్నారు. తద్వారా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. సాగు సమయంలో రూ.2600లకు వేరుశనగ విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు ప్రస్తుతం రూ.1600లకే విక్రయించడం విశేషం. విత్తనాల ఎంపికలో సరైన అవగాహన లేకపోవడం, వ్యవసాయ శాఖ అధికారులు పర్యవేక్షణ, సూచనలు, సలహాలు ఇవ్వకపోవడంతో నాణ్యతలేని దిగుబడి వచ్చినట్టు పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెట్టుబడులు కూడా రావడం లేదు


వేరుశనగ సాగులో ఆశించిన స్థాయిలో దిగుబడులు లేవు. ప్రారంభంలో తీవ్రమైన ఎండల వల్ల మొలకెత్తిన మొక్కలు దెబ్బతిన్నాయి. దాంతో దిగుబడి తగ్గిపోవడంతో పెట్టుబడులు కూడా వచ్చేలా లేవు. – తిరుపాలయ్య, రైతు

నష్టాలు వస్తున్నాయి


వేరుశనగ సాగులో దిగుబడి బాగా తగ్గిపోవడంతో నష్టాలు విపరీతంగా వస్తున్నాయి. వర్షాలు పూర్తిగా లేకపోవడం వల్ల సాగునీరు సక్రమంగా అందలేదు. దీంతో చిట్టికాయలతో పంట దిగుబడి దారుణంగా తగ్గింది. – బాలకృష్ణయ్య, పెళ్లకూరు


ఎదుగుదల లేని వేరుశనగ పంట


కల్లాంలో ఆరబోసిన వేరుశనక్కాయలు

బక్రీద్ పండుగకు మసీదుల ముస్తాబు


రాపూరులో ఈద్గాలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న నిర్వాహకులు


నాయుడుపేట: ముస్లిం మత పెద్దలతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సీఐ శ్రీనివాసరెడ్డి

నాయుడుపేట టౌన్ : బక్రీద్ పండుగ వేడుకలకు నాయుడుపేటలోని మసీదులు ముస్తాబవుతున్నాయి. బక్రీద్ సందర్భంగా ముస్లింలు ఈదుల్ జుహా నమాజును సామూహికంగా జరుపుకుంటారు. ఈ క్రమంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణంలోని జామీయా (పెద్ద మసీదు) మసీదు వద్ద ఈద్గా మైదానంలో ఉదయం 8.30 గంటలకు, పెద్ద దర్గా వద్ద అమీర్‌షావలీ మసీదు, పాత బస్టాండు వద్ద నూర్ మసీదుతో పాటు ఎల్‌ఏ సాగరం పాత, కొత్త బీడీకాలనీల్లో ఈదుల్ జుహా నమాజును సోమవారం ఉదయం 8 గంటలకు జరుపుతున్నట్లు ఆయా మసీదుల నిర్వాహకులు తెలిపారు. బక్రీద్ పండుగను పురస్కరించుకుని అనేకమంది కుర్బానీ ఇస్తారని, అందువల్ల ముందస్తుగానే సామూహిక నమాజు నిర్వహిస్తున్నట్లు ఆయా మసీదుల ముతవల్లీలు తెలిపారు.

రాపూరులో..

రాపూరు: మండలంలో సోమవారం బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకునేందుకు ముస్లింలు సిద్ధమయ్యారు. ఈ మేరకు ఈద్గా వద్ద ఏర్పాట్లు చేశారు. ఎండ తగలకుండా షామియానాలు, మంచినీటి వసతి కల్పించినట్టు ఈద్గా చైర్మన్ బాబు తెలిపారు.

సూళ్లూరుపేట రూరల్..

సూళ్లూరుపేట రూరల్ : బక్రీద్ పండుగ సందర్భంగా మన్నారుపోలూరు వద్ద ఉన్న ఈద్గాను ముస్లింలు ముస్తాబు చేశారు. సూళ్లూరుపేటలోని జామియా, అక్బరియా మసీదులతోపాటు మన్నారుపోలూరు, కోటపోలూరు, కేఆర్‌పీ, పెరిమిటిపాడు ప్రాంతాల నుంచి ముస్లింలు ఇక్కడికి వస్తారు. ఈ క్రమంలో ఈద్గా ప్రాంగణంలో షామియానాలు ఏర్పాటు చేశారు. తాగునీరు, వజూ చేసుకునేందుకు నీటి వసతి కల్పించినట్టు సూళ్లూరుపేట పట్టణంలో ఉన్న అక్బరియా మసీదు కమిటీ సభ్యుడు ఎంఏ మాలిక్ తెలిపారు. సోమవారం ఉదయం 8 గంటలకు ఈ–దుల్ అజీహా ప్రార్థనలు నిర్వహిస్తునట్లు తెలిపారు. భక్తులు ఇంటి నుంచి ఈద్గాకు బయలుదేరే సమయంలో తక్బీర్ చదువుతూ రావాలని సూచించారు.

బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

బక్రీద్ పండుగను ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ ప్రశాంతంగా జరుపుకోవాలని నాయుడుపేట డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ముస్లిం మత పెద్దలకు సూచించారు. ఆయన ఆదివారం నాయుడుపేట అర్బన్ పోలీస్‌స్టేషన్ వద్ద పట్టణంలోని పలు మసీదులకు చెందిన మత పెద్దలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ నాయుడుపేట డివిజన్‌లో ఎక్కడా గోవధ చేయరాదన్నారు. ఇతర ప్రాంతాలను నుంచి ఎవరైనా వచ్చి గోవధను ప్రోత్సహించేలా చూస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మతసామరస్యంతో పండుగ జరుపుకోవాలని సూచించారు. డివిజన్ పరిధిలోని నాయుడుపేట, సూళ్లూరుపేట, ఓజిలి, పెళ్లకూరు, దొరవారిసత్రం, శ్రీహరికోట పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఎక్కడా ప్రభుత్వ నిబంధనలను ఉల్లఘించరాదని, పోలీసుల నిఘా ఉంటుదన్నారు. ఈ సమావేశంలో అర్బన్ సీఐ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు


మాజీ ఎమ్మెల్యే కిలివేటి

నాయుడుపేట టౌన్ : ముస్లింలు బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆకాంక్షించారు. ఆయన ఆదివారం ముస్లింలకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే బక్రీద్ పండుగను పురస్కరించుకుని హజ్ యాత్రకు వెళ్లిన అనేక మంది ముస్లింలు వారి యాత్ర దిగ్విజయంగా జరుపుకోవాలన్నారు.


సూళ్లూరుపేట రూరల్ : మన్నారుపోలూరులో ముస్తాబయిన ఈద్గా

ఐదుగురు విలేకరులపై కేసు నమోదు

గూడూరు రూరల్ : గూడూరుకు చెందిన ఐదుగురు విలేకరులపై కేసు నమోదు చేసినట్టు గూడూరు రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్ తెలిపారు. గూడూరు రూరల్ రామలింగాపురంలో కిరణ్ అనే వ్యక్తి తన పట్టా భూమిలో చదును చేసుకునే క్రమంలో మట్టిని తవ్వి చెన్నూరు ప్రాంతంలో ఉన్న తన స్థలంలోకి తరలించాడని తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఐదుగురు విలేకరులు అక్కడికి చేరుకుని మట్టి తవ్వకంతోపాటు తరలింపున అనుమతి ఉందా అని ప్రశ్నించి అతని నుంచి కొంత నగదు తీసుకున్నారని పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు డీఎస్పీ విచారణ చేపట్టారని వెల్లడించారు. డబ్బు తీసుకున్న విషయం నిజమని తేలడంతో విలేకరులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ముత్యాలమ్మకు పూల అలంకరణ


పూల అలంకరణలో దర్శనమిస్తున్న ముత్యాలమ్మ

చిల్లకూరు : మండలంలోని తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పూలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టారు. ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. అనంతరం ప్రత్యేక అభిషేకాలు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. ఈవో నవీన్‌కుమార్, ట్రస్టు బోర్డు చైర్‌పర్సన్ సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ, కమిటీ సభ్యులు దువ్వూరు చంద్రశేఖరరెడ్డి పర్యవేక్షించారు.


అమ్మవారి ఆలయం ముందు మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ


బాలింతలకు పౌష్టికాహారం, చిన్నారులకు కిట్లు అందజేస్తున్న వైజేపీ లయన్స్ క్లబ్ ప్రతినిధులు

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో ఆదివారం బాలింతలకు వైజేపీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు ఎస్‌ఎల్‌ఎన్ స్వామి మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో భాగంగా గూడూరు ఏరియా ఆస్పత్రిలోని ప్రసూతి వార్డులో ఉన్న బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలని క్లబ్ సభ్యుడు కొడాలి జగదీష్ ముందుకు వచ్చారని తెలిపారు. ఈ క్రమంలోనే బాలింతలు, గర్భిణులతోపాటు చంటి బిడ్డలకు కిట్లు అందజేసినట్టు పేర్కొన్నారు. ప్రతి బిడ్డకూ ముర్రుపాలు పట్టించాలని, అప్పుడే బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు చైర్మన్ మురళీనాయుడు, సభ్యులు రాధాక్రిష్ణారెడ్డి, గోపీనాథ్‌రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

ఓజిలి: మండలంలోని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని టీడీపీ మండల నాయకులు తెలిపారు. ఎమ్మెల్యేగా నెలవల విజయశ్రీ గెలుపొందడంతో వారు ఆదివారం గ్రద్దగుంట, జోష్యులవారికండ్రిగ, గొల్లపాళెం, పాపిరెడ్డికండ్రిగ, కలివేల్‌సెంటర్ గ్రామాల్లో కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. టీడీపీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్ నాయుడు, ప్రధాన కార్యదర్శి దాసరి నిరంజన్, నాయకులు దువ్వూరు శ్రీనివాసులురెడ్డి, పాదర్తి ప్రకాష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా ఎస్‌వోఎస్ కాల్‌బాక్స్‌లు


పనిచేయని ఎస్‌వోఎస్ కాల్‌బాక్స్

దొరవారిసత్రం : మలేషియా పరిజ్ఞానంతో నిర్మించిన ఏషియా–45వ జాతీయరహదారిపై ప్రయాణికుల భద్రతపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులకు ఎంతగానో ఉపయోగంపడే పనులవైపు శ్రద్ధ చూపడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జాతీయ రహదారిలో వెళ్లే వాహనాలు ప్రమాదాలకు గురై గాయపడిన వారిని వెంటనే ఆస్పత్రులకు తరలించేందుకు ప్రతి రెండు కిలోమీటర్లకు ఒక చోట ఎస్‌వోఎస్ (సేవ్ అవర్ సోల్) కాల్ బాక్స్‌లు ఏర్పాటు చేశారు. వాటి నుంచి కాల్ చేసిన వెంటనే అక్కడికి అంబులెన్స్‌లు వచ్చి గాయపడిన వారిని ఆస్పత్రులకు తరలించే అవకాశం ఉంటుంది. అంతేగాక వాహనాల రాకపోకలు స్తంభించిన సమయంలోనూ కాల్ బాక్స్‌లు ఉపయోగపడతాయి. అవి కొన్నేళ్లుగా ఏ విధంగా వాహనదారులకు ఉపయోగపడడంలేదు. ఎస్‌వోఎస్ కాల్‌బాక్స్‌లు సోలార్‌తో పనిచేసే విధంగా రోడ్డు నిర్వహణ అధికారులు చర్యలు చేపట్టారు. అప్పటి నుంచి ఇవి పూర్తిగా పనిచేయక నిరుపయోగంగా మారాయి. అంతేకాకుండా టోల్ ప్లాజాల్లో అంబులెన్స్ సదుపాయం ఉన్నప్పటికీ ప్రమాదాల సమయంలో అంబులెన్స్ నంబర్లు తెలియక, ప్లాజా నంబర్లు అంతుచిక్కక బాధితులు పడే ఇబ్బందులు అంతాఇంతాకావు.

గ్రామ దేవతకు సామూహిక పొంగళ్లు


విశేషాలంకరణలో గ్రామ దేవత మల్లాలమ్మ


అమ్మవారికి పొంగళ్లు పెడుతున్న భక్తులు


ప్రత్యేకాలంకరణలో తాళ్లమ్మతల్లి

దక్కిలి: మండలంలోని సంగనపల్లిలో గ్రామ దేవత మల్లాలమ్మకు ఆదివారం గ్రామస్తులు సామూహిక పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించారు. పంటలు బాగా పండి ప్రతి కుటుంబమూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరుతూ గ్రామంలో ప్రతి కుటుంబానికి చెందిన వారు వచ్చి గ్రామ చెరువు కట్ట దగ్గర ఉన్న మల్లాలమ్మ ఆలయం వద్ద పొంగళ్లు పెట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటి నుంచి అమ్మవారికి బోనాలు తీసుకువచ్చారు. అమ్మవారి చుట్టూ ప్రదక్షిణ చేశారు.

తాళ్లమ్మ ఆలయంలో..

అదేవిధంగా దగ్గవోలు గ్రామ దేవత తాళ్లమ్మకు గ్రామస్తులు ఆదివారం సామూహిక పొంగళ్లు పెట్టారు. సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, అందరూ సుఖ సంతోషాలతో జీవించాలని ప్రార్థించారు. పొంతురాజు, పరుశురామయ్యకు కూడా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

ప్రజలకు చేరువగా తపాలా డాక్ పే

- డిజిటల్ లావాదేవీలు పెంచే దిశగా యాప్
- గూగుల్ పే, ఫోన్ పేలకు దీటుగా రూపకల్పన
- డాక్ పే లావాదేవీలపై గ్రీవెన్స్ వెసులుబాటు
- సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ 155299

డాక్ పే ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ లోగో

నారాయణవనం: దేశంలో డిజిటల్ లావాదేవీలను పెంచే దిశగా తపాలా శాఖ వినియోగదారులకు పలురకాల సేవలను అందించడంలో ఆసక్తి చూపుతోంది. ఉత్తరాలు, మనీ ఆర్డర్లు, కొరియర్, స్పీడ్ పోస్టులతో పాటు ప్రైవేటు సంస్థలకు దీటుగా బ్యాంకింగ్, గోల్డ్ బాండ్, బీమా తదితర సేవలను ఇప్పటికే అందుబాటులోకి తెచ్చింది. మరో అడుగు ముందుకేసి డిజిటల్ లావాదేవీల పెంపునకు గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎంల మాదిరిగా డాక్ పే అనే యాప్‌ను 2021లోనే దేశ వ్యాప్తంగా అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇప్పుడు దీన్ని ప్రజలకు చేరువ చేసే దిశగా దూసుకెళుతోంది. ఈ డాక్ పే ద్వారా ప్రజలు డిజిటల్ ఫైనాన్స్ సేవలు పొందడంతోపాటు ఇండియా పోస్టు, ఐపీపీబీ అందించే బ్యాంకింగ్ సేవల విషయమై సాయం పొందవచ్చు. డబ్బు పంపడం, క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం, డిజిటల్ రూపంలో వ్యాపారులకు నగదు చెల్లించడంలాంటి పనులను చక్కబెట్టుకోవచ్చు. ప్రతి భారతీయుడి అవసరాలను తీర్చేలా డాక్ పేను రూపొందించారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలలో యూపీఐ డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించే దిశగా దీనిని ఎప్పటికప్పుడు ఆధునీకీకరిస్తున్నారు. ఈ యాప్‌ను ఏబ్యాంకు ఖాతాదారుడైనా వినియోగించవచ్చు.

గ్రీవెన్స్ వెసులుబాటు

గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎంలో నగదు లావాదేవీల్లో ఏవైనా పొరపాట్లు చోటు చేసుకుంటే ఫిర్యాదులు చేసేందుకు అవకాశం ఉండదు. ఎందుకంటే వాటి కార్యాలయాలు మనకు అందుబాటులో ఉండవు. అయితే డాక్ పే యాప్ ద్వారా నగదు బదిలీ సమయంలో ఏదైనా పొరపాటు జరిగితే ఫిర్యాదుల స్వీకరణకు తపాలా శాఖ వెసులుబాటు కల్పించింది. డాక్ పే అనే యాప్ తపాలాశాఖ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోనే పనిచేస్తుండడంతో మన డబ్బుకు గ్యారెంటీ ఉంటుంది. యాప్ గురించిన సమగ్ర సమాచారం కోసం ఐపీపీబీ టోల్ ఫ్రీ నంబర్ 155299ను వినియోగదారులు సంప్రదించ వచ్చని తపాలా శాఖ అధికారులు చెబుతున్నారు.

డాక్ పేతో సురక్షితం


ప్రైవేట్ యూపీఏ యాప్‌లకు దీటుగా కేంద్ర ప్రభుత్వం తపాలా శాఖ ద్వారా తీసుకొచ్చిన డాక్ పే యాప్ చాలా సురక్షితమైనది. మీరు జరిపే లావాదేవీలకు రక్షణ ఉంటుంది. ఏదైనా కారణాలతో ఇబ్బందులు ఎదురైతే గ్రీవెన్స్ సెల్‌తో పాటు టోల్ ఫ్రీ నెంబరు అందుబాటులో ఉంటుంది. ఏ బ్యాంకు ఖాతాకైనా డాక్ పేతో డిజిటల్ లావాదేవీలను జరుపుకోవచ్చు. ప్లే స్టోర్‌లో యాప్ అందుబాటులో ఉంది.
– నరసింహ ప్రసాద్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోస్టాఫ్, పుత్తూరు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మ జాతర ఘటోత్సవం


ఘటోత్సవం నిర్వహిస్తున్న నిర్వాహకులు

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పట్టణంలోని బంగారుపేటలో పోలేరమ్మ జారత సందర్భంగా ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘటోత్సవం నిర్వహించారు. ఆసాదుల తప్పెట్లు, తాళాల మధ్య అమ్మవారికి ప్రీతిపాత్రమైన ఘటం కుండలకు ప్రత్యేక పూజలు చేశారు. బంగారుపేటలో తొలుత ముగ్గురి ఇళ్లకు వెళ్లి పూజలు చేశారు. సోమ, బుధవారాల్లో పూర్తిగా బంగారుపేట అంతా ఘటోత్సవం తిరగనున్నట్లు నిర్వాహకులు వివరించారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ ఆకట్టుకుంటోంది.




బంగారుపేటలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణలు